## ఆడవాళ్లు పెత్తనం చలాయించే సమాజంలో భర్తల పరిస్థితి?

# మహిళానగర్

### సతీష్ సూరి కథ

''చూడు రజిత్, 'నిన్ను ప్రేమించాను, నిన్ను ప్రేమించాను' అంటూ ఇంతకాలం నావెంట పడ్డావ్. ఇంతకీ నాలో ఏం చూసి నన్ను ప్రేమించావు?'' శెనక్కాయ వలిచి పప్పులు నోట్లో వేసుకుంటూ అడిగింది పుష్ప.

''సుకుమారమైన నీ హృదయాన్ని..., చామంతులలాంటి నీ కళ్లని..., సంపెంగలాంటి నీ ముక్కు..., రోజా పువ్వులాంటి నీ నోరు..., పొద్దుతిరుగుడు పూలవంటి నీ పళ్లు... ఇంకా...''

అబ్బా... నీకసలు పోల్చి చావడం రాదుగాని ముందర వేరుశెనక్కాయలు అయిపోయినాయి. అవి పట్రా. తింటూ తీరిగ్గా మాట్లాడుకుందాం'' రజిత్ వర్ణనకి మధ్యలోనే ఆటంకం కలిగించి చెబుతూ మిగిలిన ఒక్క శెనక్కాయ పగలగొట్టి పప్పులు నోట్లో వేసుకుంది పుష్ప.

''అలాగే...'' అంటూ బలవంతంగా లేచి వెళ్లాడు రజిత్. కాసేపయ్యాక వచ్చాడు రజిత్.

''చూడు పుష్పా... ఇప్పటివరకు పన్నెండు రూపాయల వేరు శెనక్కాయలు మింగావ్. శెనక్కాయలు అయిపోయేదాకా నీతో మాట్లాడకూడదంటావ్, అయిపోయిన వెంటనే మరల తెమ్మంటావ్. ఈసారి అయినా మాట్లాడతావా లేదా!'' గొంతులో ఏడుపును మిళితం చేసి శెనక్కాయల పొట్లాం అందిస్తూ అడిగాడు రజిత్.

''పన్నెండు రూపాయలకోసం ఏడ్చే నీలాంటి ముఖం నాకు అక్కర్లేదు... అయినా ఎంతసేపూ పార్కులో కబుర్లేనా... పచ్చగడ్డిని చూస్తూ శెనక్కాయలు తింటూ వుంటే దాని ఆనందం నీకేం తెలుసులే...'' పప్పును నోట్లో



వేసుకుంటూ అంది పుష్ప.

''అదికాదు పుష్ప... నీకోసం మీ అన్నయ్యచేత చావుదెబ్బతిన్నానే..., మీ వీధిలో నీకోసం సైకిల్‌లో తిరిగేటప్పుడు నీవైపే చూస్తూ ఎన్నిసార్లు పడ్డానో నీకు తెల్సుకదా... అలాంటి నేను పన్నెండు రూపాయలకోసం ఏడుస్తాననుకుంటావా!'' దీనంగా ముఖం పెట్టి ఏడ్చినంత పనిచేశాడు రజిత్.

''ఊరికే మగాడిలా ఏడుస్తావెందుకు...? ఇప్పుడేమయిందని, నాకు కొన్ని ఆశయాలు, సిద్ధాంతాలు, వ్యూహాలు, గట్రా వున్నాయి''

''అహ్హహ్హ... నాకు తెలుసు పుష్ప. నీ ఆశయమేంటో... నీకు కట్నం ఇవ్వడం ఇష్టంలేదుకదూ... నేనసలు కట్నమే తీసుకోను. ఏదో మీరిస్తే... తప్పదుగాని''

''నీ మొహం అదేంకాదు''

''మరయితే ఏంటమ్మో, నా చేత వేరుశెనక్కాయల వ్యాపారం పెట్టించడంకానీ నీ ఆశయమా...''

''ఛ... అదికాదు. నాకు మొగుడిగా రావాలంటే కొన్ని క్వాలిఫికేషన్లు వుండాలి. అలాంటి క్వాలిఫికేషన్ నీలో వుందా?''

''ఎందుకు లేదు. నేను బి.ఎ గత ఎనిమిదేళ్లుగా చదువుతున్నానుగా. ఇంతకాలం చదివేవాడు ఈ ఊరిలో ఇంకొకడు లేడు''

''ఛీ.ఛీ... చెప్పేది సరిగా విను. ఆ తర్వాత నాకు మొగుడవుతావో లేదో అంతా నీ ఇష్టం''

''సరే చెప్పు'' చొక్కా కాలర్ సవరించుకుంటూ వినడానికి సిద్ధమయ్యాడు.

''రూల్ నెంబర్ వన్. నాకు కోపం ఎక్కువ''

''నాకూ ఎక్కువే''

''చెప్పేది విను'' సీరియస్‌గా చూసింది పుష్ప.

''అతను పిల్లిలా ఒదిగి కూర్చున్నాడు.

''కోపమొస్తే నేను ఎవర్నీ లెక్కచేయకుండా తిడుతుంటాను, ఎదురు! మాట్లాడకుండా తిట్టించుకుంటావా?''

విచిత్రంగా చూశాడు ఆమెవైపుకు.

''ఏం తిట్టించుకుంటావా?'' ఇంకోసారి రిపీట్ చేసిందామె.

''అలాగే తిట్టించుకుంటా'' అసంకల్పితంగా పలికాడు.

''ఇంకా కోపం పెరిగిపోయిందంటే కొడ్తాను. కొట్టించుకుంటావా?''

గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు ఫీలయ్యాడు. ''నీవు నన్ను కొడ్తావా?'' జుట్టు పీక్కుంటూ అడిగాడు.

''అవును పిచ్చ పిచ్చగా కొడ్తాను. చిన్నప్పుడు నా మాట వినలేదని మా నౌకరు కాలు విరగ్గొట్టాను... నువ్వు చూసిన కుంటి నౌకరు వాడే'' కూల్‌గా చెప్పింది పుష్ప.

''పుష్పని పిశాచాన్ని చూసినట్టు చూశాడు''

''కొట్టించుకుంటావా?'' కళ్లు ఉరుముతూ అడిగింది.

''ఆ... ఆ... కొట్టించుకుంటాను'' బిక్కమొహం వేసి చెప్పాడు.

''వెరీగుడ్. నాకు వంట చేయడం రాదు. నీవే వంట చెయ్యాలి. పనిమనిషిని పెట్టుకోవడం నా ఆశయానికి వ్యతిరేకం... వంట చేస్తావా?''

''నేర్చుకుంటాను.''

''ఇంకా ఏంటంటే...''

''వద్దు నే చెపుతా గుడ్డలు ఉతుకుతా, అంట్లుకూడా తోముతా..., వంట నే చేసి పెడుతా... నీవు తిని పెడుతుండు... అంతేనా!'' ముఖం అదోలా పెట్టి అడిగాడు.

''నీవు నాకు చాలా బాగా నచ్చావు రజిత్, త్వరలో మా మమ్మీని అడిగి ముహూర్తం పెట్టిస్తా'' చెప్పింది పుష్ప.

◆ ◆ ◆

''పుష్పా... నా షర్ట్ అందుకో, అలా బజారుదాకా వెళ్లొస్తాను'' కొత్త కాపురం మొదలైన

వెల రోజుల తర్వాత వేరే ఇంట్లోకి అడుగుపెట్టి ఆరోజే బయటకెళ్లాలనే ఉబలాటంతో అడిగాడు.

''పోరా... నీవే వెళ్లి తీస్కో'' టి.వి.లో టెలిస్కూల్ కార్యక్రమం చూస్తూ చెప్పింది పుష్ప.

హడావుడిగా బయటకెళ్లి తొంగిచూశాడు రజిత్.

''ఏంటి...? బయటకెళ్లి తొంగిచూస్తున్నావ్'' విసుగ్గా అడిగింది.

''అదే ... అదే ... నీవు ఎవర్నో ఒరే అంటే, ఎవర్నా అని తొంగిచూస్తున్నా'' చెప్పాడు రజిత్.

''ఎవర్నో అంటే ఊరుకోవడానికి, వాడేమన్నా నా మొగుడా! నిన్నే నేననింది'' టీవీపై చూపును లగ్నం చేస్తూ చెప్పింది పుష్ప.

''అవ్వ... అవ్వ... అవ్వవ్వ... నన్నే... ఒరే అంటావటే... నీ అంతు చూస్తా... ఆయ్...'' గదిలో చిందులేస్తూ అన్నాడు రజిత్.

''పోరా పుస్కి నీవు నన్నేం చేస్తావ్'' నిర్లక్ష్యంగా తల విదిలిస్తూ అనింది.

ఈసారి హడావుడిగా బయటకు పరుగెత్తాడు. నాలుగు దిక్కులు చూసుకుని వెంటనే లోపలికొచ్చాడు.

''ఈసారెందుకు బయటకెళ్లావ్?'' అడిగింది పుష్ప.

''నీవన్న మాట ఎవరైనా విన్నారేమోనని'' భయంగా పుష్పవైపు చూస్తూ చెప్పాడు.


చూస్తే నీ పరువేం పోతుంది. నా పరువే పోతుంది. భర్తను ఆ మాత్రం తిట్టకపోతే మా మహిళాసంఘంలోనాకు ఎలా గౌరవమిస్తారనుకున్నావ్? అది సరేకానీ... బయటకెళితే వంట ఎవరు చేస్తారు? పోయి వంటచేసి తగలడు, మహాచెడ్డ ఆకలిగా వుంది'' గదమాయించింది పుష్ప.

''నేను... వంట చెయ్యాలా...?''

''ఇంట్లో మగాళ్లు వంట చెయ్యకపోతే, ఆడాళ్లు చేస్తారనుకున్నావా! అందుకే పెళ్లికి ముందే చెప్పింది. మర్చిపోయావా!''

''అప్పుడు నీవు జోక్ చేశావనుకున్నాను...'' నెమ్మదిగా అన్నాడు.

## స్పీడ్



''నేను స్కూటర్ని చాలా స్పీడ్‌గా నడుపుతాను అనే విషయం మొన్ననే తెలిసింది!''

''అలాగా. ఎప్పుడు?''

''రోడ్ రోలర్‌ని ఓవర్‌టేక్ చేసినప్పుడు''

- షరీఫ్ అహ్మద్ (ఇల్లంతకుంట)

''నేనేం జోక్ చేయలేదు. సీరియస్‌గానే చెప్పాను. ఆమె కంఠంలో సీరియస్ ప్రతిధ్వనించింది''

''మరయితే ఈ నెలరోజులు మీ అమ్మగారింట్లో వుంటే చిన్న పనికూడా చెప్పలేదేం?'' అమాయకంగా అడిగాడు.

''మా ఇంట్లో పెళ్లయిన నెలరోజులవరకు పెళ్లికొడుకుకి ఎవరూ పని చెప్పరు. మా నాన్నగారయితే రెండు నెలలవరకూ పనిచెయ్యలేదు''

''అంటే మీ ఇంట్లో మీ నాన్నగారుకూడా వంట చేస్తారా!'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అవును'' చెప్పిందామె.

''ఓర్నాయనో... నా కొంప ముంచావు కదరో మామో, మీ ఫామిలీ అలాంటి టైపు అని తెలిస్తే మీ వీధిలోకి చచ్చినా వచ్చేవాణ్ణి కాదురో తండ్రో... బంగారంలాంటి నా జీవితం నాశనం చేశారో'' అంటూ కిందపడి దొర్లడం ప్రారంభించాడు.

''చూడు... జరిగిందేదో జరిగింది. నోర్మూసుకుని వంటగదిలోకి వెళ్తావా లేదా?'' గద్దించింది.

''నా జీవితాన్ని అన్యాయం చేసింది చాలక నన్ను వంటగదికి అంకితమిస్తావా... చచ్చినా నీతో కాపురం చెయ్యను, నీకు విడాకులిచ్చేస్తా...'' గబగబా లేచి షర్టందుకోబోయాడు.

''ఏంట్రా నాకు విడాకులిస్తావా! ఏంటి కూశావ్, మళ్లీ కుయ్'' అరచేతిని చూచి దవడమీద కొట్టింది.

''వామ్మో...'' అరుస్తూ కిందపడ్డాడు.

''దమ్ముంటే ఇప్పుడు కొట్టవే... నీ పని చెబుతాను'' ఆ మాట అన్నాడో లేదో రెండోసారి గుయ్‌మంది గూబ.

''ఏం చేస్తావురా...'' అపరకాళిలా లేచింది.

''ఏం చేస్తాను. వంట గదిలోకి వెళ్తాను.'' అంటూ కామ్‌గా వంటింట్లోకి పరుగుతీశాడు.

◆ ◆ ◆

''కూర్చోండి...''

''థాంక్స్...''

''ఏంటి కేసు? నీదేనా...!''

''అవున్సార్ నాదే...''

''మర్డర్ చేసి లొంగిపోదామని వచ్చావా...''

''అబ్బే... అలాంటిదేం లేదుసార్'' కంగారుపడ్డాడు.

''నీ పేరు...'' అడిగాడు

''రజిత్...''

''ఏంటి కేసు...?''

''పర్సనల్ సార్... అయినా మీకు చెప్తున్నాను''

''పర్లేదు చెప్పు'' అభయమిచ్చాడు.

''నా భార్య నన్ను రోజూ విపరీతంగా కొడ్తుంది సార్''

''కొత్తగా పెళ్లయిందా..''

''అవున్సార్''

''పెళ్లయి ఎంతకాలమయింది?''

''సంవత్సరం కావస్తుంది సార్''

''అహ్హాహ్హాహ్హా.. సంవత్సరమేనా!''

''అవున్సార్'' సిన్సియర్‌గా చెప్పాడు.

''చూడయ్యా... చిన్నవాడివి కాబట్టి చెప్తున్నా, ఇవన్నీ మామూలేనయ్యా... భార్య అన్నాక కొడ్తుంది... తిడ్తుంది అన్నీ పట్టించుకోకూడదు''

''అదేంటి సార్ అలాగంటారు...''

''అలా అనక ఏం చెయ్యమంటావయ్యా... నీ భార్య కొడుతున్నట్లు సాక్ష్యమేదన్నా వుందా... చెప్పు''

''అసలు ఇక్కడకు వచ్చినట్టు తెలిస్తే బతకనివ్వదుసార్. ఇక సాక్ష్యం ఎలా తేవాలి?''

''అందుకే... అవన్నీ పట్టించుకోకు... పోనుపోను అదే అలవాటు అయిపోతుంది'' చెప్పాడు ఇన్స్పెక్టర్.

''నా బాధ మీకు అర్థంకాదుసార్... నేనెంత మనసులో క్షోభిస్తున్నానో మీకేం తెల్సు?''

''ఏంటయ్యా ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కదు... ఏం నీ భార్యకు చెప్పమంటావా? నన్నుచూడు నా భార్య నన్ను పదిహేను సంవత్సరాలనుంచి బండను బాదినట్లు బాదుతుంది. నేను నీలా... ఎవరికైనా చెప్పుకున్నానా... అసలు ఇలాంటి కేసులు టేకప్ చేశానని తెలిస్తే నన్ను బతకనివ్వదు తెల్సా...!'' మాట్లాడిన మాటలతో ఆయాసం తెచ్చుకుని రొప్పడం ప్రారంభించాడు ఇన్స్పెక్టర్.

''సారీ సర్... నేనే ఘనుడనుకుంటే నన్ను మించిన ఘనుడని తెలీక మీ దగ్గరకు వచ్చాను సార్. నన్ను క్షమించండి''

''దాందేముంది... ఈ నగర్ అంతా ఇంతేకదా...!'' చెప్పాడు ఇన్స్పెక్టర్.

''ఇది మహిళానగర్'' అని బోర్డుంటే ఏమో అనుకున్నా. దీని చరిత్ర ఇదన్నమాట... చాలా థాంక్స్ సార్. ఇన్నాళ్లకి ఒక నగ్నసత్యం తెలుసుకున్నాను. వస్తానుసార్'' బయలుదేరాడు రజిత్. కొద్ది దూరం వెళ్లగానే ఏదో గుర్తొచ్చినట్లు వెనక్కివచ్చాడు.

''సార్...''

''ఏంటయ్యా?''

''నేను మీ దగ్గరకొచ్చినట్లు మా ఆవిడతో చెప్పరుకదా!'' అడిగాడురజిత్.

''నేనూ నీ కోవకు చెందినవాడినని మరచినట్లున్నావే...?''

''ఓకే సార్... గుడ్‌బై'' అంటూ కదిలాడు రజిత్.

## అమెరికా దొంగలు



అమెరికాలో ఇప్పుడు రాబరీ చేసే పద్ధతులు పూర్తిగా మారిపోయాయి. ఇలా అన్నాంకదాని అక్కడ గజదొంగలే ఓ ఆత్యాధునిక సాధనాలనుపయోగించి రాబరీలు కొనసాగిస్తున్నారనుకుంటే... మీరు పొరబడినట్లే. చేత్తో సిరంజి పట్టుకుని... నిలువు దోపిడీలు చేసే దొంగల సంఖ్య ఇటీవలికాలంలో మరీ ఎక్కువైపోయింది. ఇంతకీ సిరంజీలో వుండేదేమిటనుకుంటున్నారు? ఎయిడ్స్ శరీరంనుండి తీయబడిన ఎయిడ్స్ క్రిములతో నిండి వుండే రక్తం.

- రజనీ శకుంతల

◆ ◆ ◆

''స్వామి తపానంద ఆశ్రమం'' పెద్ద అక్షరాలతో వ్రాసి వున్న బోర్డును మరోసారి చూసుకుని లోపలికి అడుగుపెట్టాడు అతడు.

''స్వామివారున్నారా?'' చెట్లకు నీళ్లు పడుతున్న ఓ కాషాయ వస్త్రధారిని అడిగాడు అతడు.

''ఉన్నారు... ఆ అరుగుమీద కూర్చోండి. కాసేపట్లో వస్తారు...''

''అలాగే...'' అంటూ వెళ్లి అరుగుమీద కూర్చున్నాడు.

కాసేపటికి నిండుగా పెరిగిన తెల్లటి గడ్డంతో నిండైన తేజంతో ఒక వ్యక్తి వచ్చాడు. అతన్ని చూడగానే కూర్చుని వున్న వ్యక్తి లేచి నమస్కరించాడు.

''ఏంటి నాయనా నీ సమస్య?''

''స్వామి ఈ ఐహిక సుఖాలమీద విరక్తి పుట్టింది. అందుకే మీ శిష్య పరమాణువుగా వుండిపోదామని వచ్చాను''

''సన్యసించడం నీవనుకున్నంత సులువు కాదు నాయనా''

''ఫర్వాలేదు స్వామి అన్నింటినీ త్యజించడానికే సిద్ధపడ్డాను''

''నీ నిర్ణయం మారదా...''

''మార్చుకోలేను స్వామి''

''నీ పేరు''

''రజిత్... రజిత్ కుమార్''

''పెళ్లయిందా...!''

''అయింది స్వామి...''

''పిల్లలున్నారా...?''

''లేరు...''


''ఇది మహిళానగర్''లో స్వామి''

''అయితే నువ్వు భార్యా బాధితుడవన్నమాట...''

''అక్షరాలా...''

''అయితే నీ భార్యనుంచి నిరభ్యంతర పత్రము తెమ్ము, అది తెస్తే ఇందులో చేర్చుకోటానికి నాకేం అభ్యంతరము లేదు.''

అంతే దబ్బున కళ్లుతిరిగి పడిపోయాడు రజిత్ పాపం!! ★



డిజైన్: పోలెపల్లి సరళ, అనూరాధ (నారాయణపేట)